ఆన్‌లైన్‌లో అష్టావధానం

- తెలుగు భాషపై ఆస్ట్రేలియా నుంచి పాఠాలు
- తటవర్తి గురుకులం పేరుతో తరగతులు
- పద్యాలు, అవధానాలు నేర్పిస్తున్న కళ్యాణ చక్రవర్తి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఆన్‌లైన్ ద్వారా పాఠాలు నేర్చుకోవడం చూశాం.. కానీ ఆన్‌లైన్ ద్వారా అవధానం చేయడం మొదటిసారి కావడం విశేషం. అంతేకాకుండా అవధానం చేయడమంటే మాటలు కాదు.. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గురువు తటవర్తి కళ్యాణ చక్రవర్తి ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా నేర్పిస్తున్న పాఠాలు అవధానాన్ని అవలీలగా చేసేలా ఉన్నాయి. అలాగే తెలుగు వెలుగును చాటుతున్నాయి. తెలుగు భాషపై మమకారంతో 2021లో తటపర్తి గురుకులాన్ని ఆయన ఏర్పాటు చేశారు. విదేశాల్లో ఉన్న తెలుగు వారికి పద్య రచనలు, నాటకాలు, శతకాలు ఆన్‌లైన్ ద్వారా నేర్పించడం మొదలుపెట్టారు. ఆన్‌లైన్ మాధ్యమంలో ఉచితంగా పద్యాలు, వ్యాసరచనతో అష్టావధానం ఎలా చేయాలో వివరిస్తున్నారు. వీటిని అనేక మంది వినియోగించుకుంటున్నారు. దేశంతో పాటు జర్మనీ, యూకే, న్యూజిలాండ్, అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ తదితర దేశాల్లో ప్రజలు ఈ ఆన్‌లైన్ ద్వారా నేర్చుకుంటున్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు.



తెలుగు అందం అందరికీ తెలియాలి

"తెలుగు భాషలోని అందం అందరికీ తెలియాలని తటపర్తి గురుకులాన్ని స్థాపించాను. పద్యం వేదికలకు పరిమితం కాకుండా అందరూ నేర్చుకుని తెలుగు భాష వ్యాప్తి చేస్తారనే ఆలోచనలతో ఆన్‌లైన్ ద్వారా పద్యరచనలు, శతకాలు, అవధాన ప్రక్రియను నేర్పిస్తున్నాను. ఇదంతా ఉచితమే."

– తటవర్తి కళ్యాణ చక్రవర్తి (ఆస్ట్రేలియా), అవధాని, సద్గురువు

అష్టావధానం చేస్తారిలా..

అవధానం చేసే వ్యక్తి చుట్టూ 8 మంది పృచ్ఛకులు ఉంటారు. ఆ ఎనిమిది మంది అవధానం చేసే వారిని తికమక పెట్టి ఆలోచలో పడేస్తారు. సమస్యను పూరించడానికి అవధానం చేసేవారు తమ ఆలోచనలకు పదను పెడుతుంటే అప్రస్తుత ప్రసంగం చేసేవారు మధ్య మధ్యలో సంబంధం లేని ప్రశ్నలు వేసి ఏకాగ్రతను చెడగొట్టడానికి శత విధాలా ప్రయత్నిస్తారు. కానీ అవధానం చేస్తున్న వారు ఈ అప్రస్తుత ప్రసంగానికి సమాధానం చెబుతూ వారికి ఇచ్చిన సమస్యను పూరిస్తారు. దీనికి ఏకాగ్రత, ఆలోచన, భాషపై పట్టు, తెలివితేటలు కావాలి. ఇవన్నీ కావాలంటే వారికి అనుభవం ఉండాలి. కానీ ఏ అనుభవం లేకుండా ఆన్‌లైన్‌లో తరపర్తి కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో అవధానం నేర్చుకుని కాకలు తీరిన అనుభవజ్ఞులతో ఇద్దరు చిచ్చర పిడుగులు పోటీపడి మరీ గెలిచారు. 13 ఏళ్ల వయసులో అయ్యలసోమయాజుల లక్ష్మి అహల, వింజమూరి సంకీర్త్‌లు యూఎస్‌లో జన్మించి హైదరాబాద్‌లో ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటున్నారు. వీరు ఈనెల 9వ తేదీన ఆన్‌లైన్‌లో అవధానం చేసి శెభాష్ అనిపించుకున్నారు.

ఆన్‌లైన్‌లో నేర్చుకుంటూ..



"ముఖ్యంగా మనదైన అవధానాలు, శతకాలు, పద్యాలు నేటి తరం పూర్తిగా మరిచిపోతుంది. ఇక్కడ తెలుగు మూలలతో విదేశాలలో స్థిరపడ్డా గురుతుల్యులు కళ్యాణ చక్రవర్తి తెలుగు పద్యం అంతరించపోకూడదని ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. విశ్రాంత ఉపాధ్యాయుల దగ్గర నుంచి వ్యాపారులు చాలా మంది పద్య రచనలు నేర్చుకుంటున్నారు."

– వాగంటి మాలతి, ప్రవచనకర్త, ఆకాశవాణి రేడియో వ్యాఖ్యాత

పద్యరచనలో శిక్షణ పొందుతున్నా..



పద్యరచన, శతకాలపై ఆసక్తి ఎక్కువగా ఉండేది. అయితే స్కూల్‌లో అవి చాలా తక్కువగా నేర్పిస్తున్నారు. 2021 నుంచే తటవర్తి గురుకులంలో ఆన్‌లైన్‌లో చేరాను. అష్టావధానం కూడా చేశాను.

– వింజమూరి సంకీర్త్, అవధాని

అదృష్టంగా భావిస్తున్నా..



పురాణాలు, ప్రవచనాలు వింటూ తెలుగు భాషపై మక్కువతో అవధాన విద్యను గురువు తటవర్తి కళ్యాణచక్రవర్తి వద్ద నేర్చుకుంటున్నాం. వారి సమక్షంలో ఆన్‌లైన్‌లో పండితులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి అవధానం పూర్తి చేసి వారి ఆశీస్సులు తీసుకున్నాను.

– అయ్యల సోమయాజుల లక్ష్మి అహల, అవధాని

అవధానం చేయాలనేది కోరిక



అవధానం అనేది ఒక అద్భుతమైన ప్రక్రియ. నేను ఎంఏ తెలుగు చేశాను. అవధానం చేయాలనేది నా కోరిక. నేనే కాకుండా చాలా మంది ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు కూడా నేర్చుకుంటున్నారు. వారంలో మాకు కుదిరిన సమయంలో ఆన్‌లైన్‌లో గురువు తటవర్తి కళ్యాణ చక్రవర్తి శిక్షణ ఇస్తున్నారు.

– పీఎస్ఎన్ శ్రీలత, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

వేమగిరి లారీ యూనియన్ అధ్యక్షుడిగా బాబి



యూనియన్ అధ్యక్షుడు బాబి తదితరులను అభినందిస్తున్న సభ్యులు

కడియం: వేమగిరి క్వారీ, టిప్పర్ లారీ యూనియన్ అధ్యక్షుడిగా చెల్లుబోయిన మణికృష్ణ (బాబి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక వేమగిరి లారీ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అనంతరం వివరాలను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా కె.రాజేష్, కార్యదర్శిగా ఎం.సురేష్ (నాని), కోశాధికారిగా ఎం.మణికంఠ, సహ కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా గుబ్బల శ్రీను, గంగుల శివ, ఎస్.పోసిబాబు, జి.నాగు, చల్లా శ్రీనివాసు, సీహెచ్ శ్రీనివాస్, బి.సతీష్, ఎం.సతీష్, కె.సతీష్‌తో పాటు గౌరవ సభ్యులుగా వాసంశెట్టి బాలాజీ, నరాల శీను, తోట అప్పారావు, నరాల ఆంజనేయులు, జంగా వినోద్, బి.వెంకటేష్‌లను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కడియం: తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, పాలకవర్గం తెలిపింది. కంటి వైద్య పరీక్షలు, డెంటల్, జనరల్, గుండె, ఆర్థో విభాగాలకు చెందిన వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారని వివరించారు. ఇతర వివరాలకు కార్యాలయం వద్ద సంప్రదించాలన్నారు.

దుష్ప్రచారం చేసిన వారిపై చర్యలు చేపట్టండి

రాజమహేంద్రవరం సిటీ: సోషల్ మీడియాలో కాంగ్రెస్ చీఫ్ షర్మిలపై అవినాష్‌రెడ్డి అనుచరులు చేసిన దుష్ప్రచారం చర్యలు పట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలసి ఫిర్యాదు చేశారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతికి బీజేపీ కృషి చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం సబ్ కా సాత్ సబ్ వికాస్ నినాదంతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. పలువురు కార్యకర్తలు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. దేశంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమని జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, పార్టీ నాయకులు మాలతిరాణి, కోడూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీవిజయ శంకర సంగీత నృత్య పాఠశాల నాట్యాచార్యులు పసుమర్తి శ్రీనివాసశర్మ రచించిన నాట్య సంహిత పుస్తకాన్ని ఎంపీ దగ్గుబాటి ఆవిష్కరించారు. రచయిత శ్రీనివాస శర్మను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ కుమారి మండపాక నాగలక్ష్మి, కళాగౌతమి వ్యవస్థాపకుడు మూర్తి, వీణ విద్వాంసులు కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: కంగువా
సూర్యమినీ	: వెనమ్,సింగం ఎగైన్
సూర్యప్యాలెస్	: కంగువా
శివజ్యోతి	: మట్కా
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీభాస్కర్
రాజా	: మట్కా
రంభ	: బఘీరా
ఊర్వశి	: కంగువా
మేనక	: జితేందర్‌రెడ్డి, జాతర
కుమారి	: దేవర
అప్సర	: మట్కా
నామవరం	
వివిఎస్.మహల్	: కంగువా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మట్కా
కడియం	
వెంకటసూర్య	: కంగువా

చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: వివిధ చిట్‌ఫండ్స్ కంపెనీ ప్రతినిధులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు సోమవారం సమావేశమయ్యారు. వచ్చే నెల 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక మొత్తంలో బాధితులకు పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఆయా సంస్థల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. రాజీపడదగిన కేసులన్నీ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాజమహేంద్రవరం లీగల్ మేనేజర్ సీహెచ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీజనల్ వ్యాధులపై శిక్షణ

రాజమహేంద్రవరం రూర్: సీజనల్ వ్యాధులను సంపూర్ణ స్థాయిలో ఎదుర్కొనేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఆనంకళా కేంద్రంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ కె.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ జె.సంధ్య సారథ్యంలో జిల్లా మలేరియా సహాయ అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఈ శిక్షణ చేపట్టనున్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఎంపిక చేసిన ఆరోగ్య సహాయకులకు జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంపై తర్ఫీదు ఇచ్చారు. దోమలు, లార్వా నియంత్రణ కార్యక్రమం, ఫాగింగ్ నిర్వహణ, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేస్తారు.

చదరంగంతో మేధస్సుకు పదును



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ కృష్ణనాయక్

రాజమహేంద్రవరం సిటీ: చదరంగం ఆడటంతో మేధస్సుకు పదును పెడుతుందని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీకందుకూరి వీరేశలింగం పుర మందిరం (టౌన్ హాల్)లో జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ అండ్ రీడింగ్ రూమ్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని వివిధ స్కూల్స్ నుంచి దాదాపు 70 మంది క్రీడాకారులు వచ్చారు. లైబ్రరీ సెక్రటరీ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా వేణుగోపాల్ రాయుడు, యాక్షన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, టౌన్ హాల్ సభ్యులు మేడా గురుదత్త ప్రసాద్, రెడ్డి రాజు, కురగంటి సతీష్, లైబ్రేరియన్ వీటీవీ సుబ్బారావు చదరంగం పోటీలకు ఆర్బిట్రేటర్లుగా జీవీ కుమార్, జి.హేమచంద్రమౌళి, ఎల్.మౌళి వ్యవహరించారు.

గో మాంసం స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక తాడితోట సెంటర్‌లో 2,300 కిలోల గోమాంసాన్ని ఒకటో పట్టణ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. తాడితోటలోని కోడి, మేక మాంసం దుకాణంలో గోవు మాంసం ఉందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఆ ప్రాంతంపై దాడి చేశారు. ఆ దుకాణంలో గో మాంసం లభించడంతో పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఆ మాసం గోవుదేనని నిర్ధారణ చేశారు. దీంతో కేరళకు చెందిన దుకాణదారుడు జార్జ్‌విగ్నేష్‌ను అరెస్టు చేశారు.

ఆర్ట్స్ కళాశాల అవగాహన ఒప్పందం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం విజయవాడ అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్, రాజమహేంద్రవరంలోని జీవచిత్రనం సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ రామచంద్ర.ఆర్‌కే సోమవారం తెలిపారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించడానికి ఈ సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సునీల్ కుమార్ దువ్వూరి కృషి మేరకు ఈ సంస్థల సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయడం, యానిమేషన్, ఐటీ, ఫినాన్స్ విభాగాలకు సంబంధించిన వృత్తి నైపుణ్యాల్లో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తుందన్నారు. అవసరమైన ప్రాజెక్టు ఆధారిత శిక్షణతో పాటు ఇంటర్న్‌షిప్‌లను కల్పించడం, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులు నిర్వహించడం వంటివి సంస్థలు చేపడతాయన్నారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ చింతా, జీవచిత్రనం సంస్థ ఆపరేషన్స్ అధిపతి సత్య వెంకటేష్ కలిగట్లతో ఒప్పంద పత్రాలపై సంతకం చేశామన్నారు.



ఒప్పంద పత్రాలతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, సంస్థ ప్రతినిధులు

ఇసుకను అక్రమంగా తరలించారని ఫిర్యాదు

కడియం: ఇసుకను అక్రమంగా దోచుకుంటున్న కాంట్రాక్టర్‌ను తక్షణం అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో జేగురుపాడు ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్‌కుమార్ కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కె.పోసిబాబులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ వివరాలను వారు స్థానిక విలేకరులకు తెలిపారు. ఇసుకను తవ్వి తీసే ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్ ఎల్–2, వారి బినామీ అమలాపురానికి చెందిన ఆకుల బాబి, మరికొంత మంది నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలను వినియోగించి ఇసుకను తవ్వుతున్నారని పేర్కొన్నారు. నదీ గర్భంలో ఎటువంటి మైనింగ్ చేయరాదని నిబంధన ఉన్నా ఆదివారం రాత్రి ఇసుకను తవ్వించారన్నారు. ఐదు భారీ యంత్రాలతో ఇసుక తవ్వి వందల కొలదీ లారీల్లో తరలించారన్నారు. ఇసుక ర్యాంపును ఆనుకుని వేలాది ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయని, జియో కోఆర్డినేట్ పరిధిలో కాకుండా కాంట్రాక్టర్‌కు నచ్చిన చోట ఇసుకను తవ్వుతున్నారన్నారు. ఇలా నదిలో ఇష్టానుసారంగా తవ్వడంతో వరదల సమయంలో వ్యవసాయ భూములు కోతకు గురై కొట్టుకుపోయే పరిస్థితి ఎదురవుతోందన్నారు. భూగర్భ జలాలు అడుగంటి నర్సరీ రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. యంత్రాలను వినియోగించడం వల్ల వందలాది మంది కూలీల ఉపాధి కరవవుతోందన్నారు. సుమారు 200 లారీల ఇసుకను అక్రమంగా తరలించుకుపోయిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకూ తరలించిన ఇసుక ఎంతో తేల్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు నాగిరెడ్డి వీరశివాజీ, పాలపర్తి ప్రకాష్ కుమార్, ఫిషర్‌మెన్ సొసైటీ మాజీ ప్రెసిడెంట్ బళ్ల అన్నవరం, మారె శ్రీనివాసరావు, వార శరత్, తోర్లపాటి ఏసు, చక్రవర్తి, ప్రత్తిపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కడియం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న స్టాలిన్, సాకా కిరణ్ తదితరులు

కిక్ బాక్సర్‌కు అండగా ఏపీజీఈఏ

రాజమహేంద్రవరం రూరల్: అంతర్జాతీయ ఇండోనేపాల్ కిక్‌బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించి, ఎంట్రీ ఫీజు రూ.60 వేలు కట్టడానికి ఇబ్బంది పడుతున్న బాలికకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) అండగా నిలిచింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. బొమ్మూరు గిరిజన సంక్షేమ పాఠశాలలో కర్రి పద్మశ్రీ 8వ తరగతి చదువుతుంది. అక్కడి టిడ్కో కాలనీలో నివసిస్తున్న దివ్యశ్రీ ఇటీవల అంతర్జాతీయ ఇండోనేపాల్ కిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలలో పాల్గొనాలంటే ఎంట్రీ ఫీజు, ఖర్చులు మొత్తం కలిపి రూ.60 వేల వరకూ ఖర్చవుతోంది. అంత ఆర్థిక స్తోమత లేక దివ్యశ్రీ ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్ తమ సంఘం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగా సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ అసోసియేషన్ కార్యదర్శి గాదా నాగేశ్వరరావు, ఆయన మిత్ర బృందం, విల్సన్ పాల్, ఆయన మిత్ర బృందం, కడియపులంక గ్రామ సర్పంచ్ పాతంశెట్టి రాంజీ, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ సిబ్బంది రూ.60 వేలను ఇచ్చారు. ఈ మేరకు సోమవారం బొమ్మూరులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో కిక్ బాక్సర్ కర్రిదివ్యశ్రీ, ఆమె తండ్రి కర్రి కొండలరావులకు ఆ నగదును అందజేశారు. మట్టిలో మాణిక్యాలకు తమ సంఘం, జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు అండగా నిలుస్తారని జిల్లా ఏపీజీఈఏ అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్ వర్మ తెలిపారు. జిల్లా కోశాధికారి కాకర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కిక్ బాక్సర్ దివ్యశ్రీకి రూ.60 వేలు అందజేస్తున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు


అక్షరానికే అంకితం ఆవంత్స

సీటీఆర్‌ఐ: జీవితమే కవిత్వం అని నమ్మి, జీవితాన్ని కవిత్వానికి అంకితం చేసిన కవి ఆవంత్స సోమసుందర్ అని నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సంయుక్త నిర్వహణలో జరిగిన సభకు ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. సోమసుందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆరున్నర దశాబ్దాల సాహితీ యాత్రలో, అనేక ఉద్యమాలు, పోరాటాలు, చవి చూశారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు శాఖధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ ఆవంత్స చేయని సాహితీ ప్రక్రియ లేదని, కవిత్వం, గేయం, కథా, నాటకం, అనువాదం, బాల సాహిత్యం, నవలలు రచించారన్నారు. వేల సంఖ్యలో వ్యాసాలు, వ్రాసిన అసలు సిసలైన అభ్యుదయ కవి సోమసుందరం అని కొనియాడారు. విశిష్ట అతిథి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు మాట్లాడుతూ జీవితాన్ని ఉద్యమానికి, సాహిత్యానికి అంకితం చేసిన సోమసుందర్ లాంటి వ్యక్తులు, కవులు సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తారని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.రాజ్‌కుమార్, పి.సుధ, జె.సుగుణ, హితకారిణి పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు చీర్ల సీతారామనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సోమసుందర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణ తదితరులు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



కడియంలో గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు



ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడియం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక లైబ్రరీలో సోమవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, ఆరోగ్య సంరక్షణపై అవగాహనా సదస్సు, కవి సమ్మేళనం నిర్వహించారు. లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవినిర్మల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో 12వ శతాబ్దం నుంచి శతక సాహిత్యం ఉందని, శతకకవులు ఎన్నో నీతులతో కూడిన పద్యాలు రాశారని, ఆ శతకాలు విద్యార్థులకు ఆదర్శం కావాలన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వ్యవసాయం కూడా అభివృద్ధి చెందాలని 9వ తరగతి విద్యార్థిని వంగ హారిక మాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా వైద్య సిబ్బంది రామకృష్ణ, కృష్ణవేణి వ్యవహరించి, విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన సాధ్యమని రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక కార్యదర్శి మతల రమేష్ అన్నారు. స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్‌కు ఆచార్య ఎస్ఆర్ రంగనాథన్, సీనియర్స్‌కు కృత్రిమ మేధ ఉపయోగాలు వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ట్రస్టు సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, కీర్ల తాతారావు, పోడిపిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆల్కాట్‌తోట శాఖా గ్రంథాలయంలో వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఏసీ గార్డెన్ మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మి, ఎస్ఆర్ఎంసీహెచ్ ఉపాధ్యాయురాలు దేవిలు వ్యవహరించారని లైబ్రేరియన్ కొత్తపల్లి రమ్యశ్రీ తెలిపారు.

వ్యాసరచన పోటీలు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ఎం.యశస్విని, కె.మేఘన, కె.చరణ్ మొదటి మూడు స్థానాలు సాధించారు. క్విజ్ పోటీలో ఎం.యశస్విని, కె.శివకుమారి, కె.అజయ్ టీమ్‌లు గెలుపొందగా, కన్సొలేషన్ బహుమతిని ఎం.ఉషా సాయి తనుజ బృందం గెలుపొందింది. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, అధ్యాపకులు బీవైఎన్‌వీ ప్రసాద్, ఎస్.సుజాత, ఎస్.మంజువేణి పాల్గొన్నారు. ఈ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీఎల్ నరసింహం సహకారంతో బి.రామకృష్ణ నిర్వహించారు.

పాహిమాం.. పరమశివా

- పుష్కరాల రేవుకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన శివాలయాలు



పుష్కరాల రేవులో రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సీటీఆర్‌ఐ: శివ కేశవులకు ప్రీతికరమైన కార్తిక సోమవారం తెల్లవారుజాము నుంచే నగరంలోని అన్ని ప్రధాన గోదావరి స్నానఘట్టాలు భక్తులతో కిటకిటలాడాయి. పుష్కరాల రేవు వద్ద జనం తాకిడి అధికంగా ఉంది. పుణ్యస్నానాలు చేసిన భక్తులు దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయ స్వామి ఆలయంలో జరిగిన అభిషేకాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉమాకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, భువనేశ్వరీదేవికి కుంకుమార్చనలు చేశారు. శృంగేరీ శారద శంకరమఠంలో చంద్రమౌళీశ్వరునికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. టి.నగర్‌లోని విశ్వేశ్వర స్వామి ఆలయం, జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు జరిగాయి.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక టి.నగర్‌లో కొత్తబ్రిడ్జి టోల్‌గేట్ వద్ద శ్యామలాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ నిర్మాణకర్త బత్తిన అప్పారావు, కుటుంబ సభ్యులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేసి అనంతరం వృద్ధులకు అన్నప్రసాదం, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. బొమ్మూరులోని గౌరీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయాన్ని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సందర్శించారు.

కించపరచడం సరికాదు

రాజమహేంద్రవరం సిటీ: నలభై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా పని చేస్తున్నానని, అటువంటి తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ పార్టీని నడిపించడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నానంటూ డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి వ్యాఖ్యానించడం చాలా బాధాకరమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాలేపల్లి మురళీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున గత ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఫండ్ ఇవ్వలేదని ఎవరూ ఎక్కడా చెప్పలేదని, ఈ విషయాన్ని బాహాటంగా ఆయన పేర్కొనడం పార్టీకి నష్టం చేకూర్చే చర్యేనన్నారు. డబ్బుంటేనే రాజకీయాలు చేయాలనడం కూడా సరికాదని, ఒక్క డబ్బుంటేనే చాలదని, పార్టీకి క్షేత్రస్థాయి నుంచి కార్యకర్తల బలం కూడా ఉండాలన్నారు.